ప్రభాత తెలుగు దినపత్రిక jayabheridaily.com 13-05-2024
# జయభేరి
సోమవారం
మల్కాజిగిరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
సంపుటి : 01 | సంచిక : 265 | పేజీలు : 8 | వెల : 4

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889

JB జయభేరి




2 లో

# సమరానికి సై

✍ జయభేరి, హైదరాబాద్ :

దేశంలో సార్వత్రిక ఎన్నికలలో భాగంగా ఇదివరకే 3 విడతల పోలింగ్ జరిగింది. లోక్ సభ ఎన్నికల 4వ విడత పోలింగ్ నేడు 96 పార్లమెంట్ నియోజకవర్గాలలో ఈసీ నిర్వహిస్తోంది. తెలంగాణలో 17 లోక్ సభ స్థానాలతో పాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానానికి ఉప ఎన్నిక, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీతో పాటు 25 లోక్ సభస్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. సార్వత్రిక ఎన్నికల నాలుగో విడతలో భాగంగా 10 రాష్ట్రాలు / కేంద్ర పాలిత ప్రాంతాలలో నేడు ఓటింగ్ జరుగుతోంది. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న వారికి ఓటు వేసేందుకు అవకాశం కల్పించనున్నారు. పోలింగ్ జరిగే నియోజకవర్గాల్లో స్కూళ్లు, కాలేజీలకు సెలవు ప్రకటించారు. 1.92 లక్షల పోలింగ్ స్టేషన్లలో 17.7 కోట్ల మంది ఓటర్లు నేడు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్, వీల్ చైర్లు లాంటివి ఏర్పాటు చేశారు. వృద్ధులు, దివ్యాంగ ఓటర్ల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశాతో పాటు జమ్మూ కాశ్మీర్ లో మొత్తం 96 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఏపీ 25 ఎంపీ స్థానాలు, తెలంగాణ 17 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 13 లోక్‌సభ స్థానాల్లో, మహారాష్ట్రలో 11, మధ్యప్రదేశ్‌లో 8, పశ్చిమ బెంగాల్‌లోని 8 లోక్ సభ స్థానాలకు, బీహార్, జార్ఖండ్‌ల్లో ఐదు స్థానాలకు, ఒడిశాలో నాలుగు సీట్లకు, జమ్మూ కాశ్మీర్‌లో ఒక స్థానానికి ఈసీ ఎన్నికలు నిర్వహిస్తోంది.

## కాశీ విశ్వనాథుని దర్శించనున్న మోదీ



✍ జయభేరి, వారణాసి:

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వారణాసి లోని ప్రఖ్యాత కాశీ విశ్వనాథ ఆలయాన్ని సోమవారం దర్శించనున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఈనెల 14వ తేదీన వారణాసి నుంచి ప్రధాన మంత్రి నామినేషన్ వేయనుండటంతో దీనికి ముందుగానే ఆయన కాశీ విశ్వనాథుని ఆశీస్సులు తీసుకోనున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. సాయంత్రం వారణాసిలో మోదీ రోడ్‌షోకు భారీగా ఏర్పాట్లు కూడా జరుగుతున్నాయి. ప్రధానికి ఘనస్వాగతం పలికేందుకు వారణాసి సిద్ధంగా ఉందని, ప్రజలు మరోసారి ఆయనను గెలిపించాలని నిశ్చయిచుకున్నారని కేంద్ర మంత్రి, చాందౌలి

...మిగతాది 2 లో

## పది గ్యారెంటీలతో ఆప్ అధినేత కేజ్రీవాల్



✍ జయభేరి, న్యూఢిల్లీ, మే 12:

'నన్ను అరెస్టు చేసి ఆప్‌ను విచ్ఛిన్నం చేయాలని, ఆప్ ప్రభుత్వాన్ని కూలదోయాలన్న బీజేపీ కుట్ర భగ్నమైంది. నా అరెస్టుతో ఆప్ మరింత బలపడింద'ని ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాను జైలులో ఉన్నప్పుడు ఆప్ ఎమ్మెల్యేలను, నాయకులను బీజేపీ సంప్రదించిందని తెలిపారు.

...మిగతాది 2 లో



## యువ ఆటగాళ్లతో.. పోటీగా ఫుట్ బాల్

✍ జయభేరి, హైదరాబాద్ :

నిన్నటి వరకూ లోక్ సభ ఎన్నికల ప్రచారంలో బిజీబిజీగా గడిపిన సీఎం రేవంత్ రెడ్డి... ఇవాళ రిలాక్స్ మోడ్ లో కనిపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో యువ ఆటగాళ్లతో కలిసి కాసేపు ఫుట్ బాల్ ఆడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సరదాగా ఫుట్ బాల్ ఆడిన సీఎం రేవంత్ రెడ్డి. నిన్నటి వరకు ఎన్నికల ప్రచారంతో బిజీగా గడిపిన సీఎం రేవంత్ రెడ్డి ఇవాళ ఫుట్ బాల్ ప్లేయర్ గా మారి యూనివర్సిటీలో సందడి చేసినారు.. రేపటి నుంచి మళ్లీ ప్రజా సేవకు సిద్ధమవుతుండగా... ఇవాళ సెంట్రల్ యూనివర్సిటీ గ్రౌండ్ లో యువ ఆటగాళ్లతో కలిసి ఫుట్ బాల్ ఆడినట్లు తెలిపారు. అంతర్జాతీయ క్రీడా వేదికలపై భారత పతాకాన్ని ఎగురవేసేందుకు తెలంగాణ యువతను క్రీడల్లో ప్రోత్సహిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.

## మెదక్ లో రసవత్తర రాజకీయం

- తొలిసారి ముక్కోణ పోటీ
- మోదీ, రేవంత్ రెడ్డి, కేసీఆర్ మధ్యే పోటీ?
- మోదీ, రాహుల్ గాంధీ సభలు
- సర్వశక్తులు వడ్డిన కేసీఆర్, హరీశ్ రావు



✍ జయభేరి, మెదక్ :

మెదక్ లోక్ సభ ఎన్నికల్లో విజయం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్ రావుకు తమ రాజకీయ జీవితంలోనే అతి పెద్ద ఛాలెంజ్ గా మారింది. తెలంగాణ సాధించిన తరవాత, పది సంవత్సరాలు రాష్ట్రంలో జరిగినా అన్ని ఎన్నికల్లో తమకు ఎదురులేనట్టుగా గెలుచుకుంటూ వచ్చిన బీఆర్ఎస్ పార్టీ, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయి అధికారం కోల్పోవటంతో ఆ పార్టీ పరిస్థితి పూర్తిగా తలకిందులైయింది. బీఆర్ఎస్ పార్టీ 2001లో ఏర్పాటు చేసిన తర్వాత, జరిగిన అన్ని

...మిగతాది 2 లో



## కంటోన్మెంట్ ఉపఎన్నిక..

- కాంగ్రెస్‌కు కీలకం..
- బీఆర్ఎస్ ఆరాటం..

✍ జయభేరి, హైదరాబాద్ :

లోక్ సభ ఎన్నికలతోపాటు సికింద్రాబాద్ కంటోన్మెంట్ స్థానానికి ఉపఎన్నిక సైతం నేడు జరగనుంది. ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన లాస్య నందిత ఫిబ్రవరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించిన సంగతి తెలిసిందే. దీంతో కంటోన్మెంట్ స్థానానికి ఉపఎన్నిక అనివార్యమైంది. బీఆర్ఎస్ నుంచి లాస్య నందిత సోదరి నివేదిత పోటీ

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## సమరానికి సై

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, బీహార్, జార్ఖండ్, ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, ఒడిశాతో పాటు జమ్మూ కాశ్మీర్ లో మొత్తం 96 లోక్ సభ స్థానాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. ఏపీ 25 ఎంపీ స్థానాలు, తెలంగాణ 17 స్థానాలు, ఉత్తరప్రదేశ్‌లోని 13 లోక్‌సభ స్థానాల్లో, మహారాష్ట్రలో 11, మధ్యప్రదేశ్‌లో 8, పశ్చిమ బెంగాల్‌లోని 8 లోక్ సభ స్థానాలకు, బీహార్, జార్ఖండ్‌ల్లో ఐదు స్థానాలకు, ఒడిశాలో నాలుగు సీట్లకు, జమ్మూ కాశ్మీర్‌లో ఒక స్థానానికి ఈసీ ఎన్నికలు నిర్వహిస్తోంది.

**పశ్చిమ బెంగాల్ :** పశ్చిమ బెంగాల్‌లో సోమవారం లోక్‌సభ ఎన్నికల నాల్గవ విడత పోలింగ్ జరుగుతోంది. కాంగ్రెస్‌కు చెందిన అధిర్ రంజన్ చౌదరి, టీఎంసీ నుంచి శతృఘ్న సిన్హా, మహువా మోయిత్రా, క్రికెటర్ యూసుఫ్ పఠాన్ ముఖ్యులుగా ఉన్నారు. వీరితో పాటు బీజేపీ నేతలు ఎస్ఎస్ అహ్లువాలియా, దిలీప్ ఘోష్‌లు బరిలోకి దిగారు.

**ఉత్తర ప్రదేశ్ :** ఉత్తరప్రదేశ్‌లో అందరి దృష్టి కనౌజ్, ఖేరీలపై ఉంది. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు, యూపీ మాజీ సీఎం అఖిలేష్ యాదవ్ కనౌజ్ నుంచి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి అజయ్ మిశ్రా తేని ఖేరీ నుంచి పోటీ చేస్తున్నారు. ఉన్నావ్‌లో బిజెపి ఎంపి సాక్షి మహరాజ్ ఎస్పీ నేత అన్నూ టాండన్‌తో తలపడ్డారు.

**మహారాష్ట్ర :** మహారాష్ట్రలో కేంద్ర మంత్రి రావుసాహెబ్ దాన్వే, బీజేపీ నాయకురాలు పంకజా ముండే, నటుడు అమోల్ కొల్హే వంటి ప్రముఖులు బరిలో నిలిచారు. అన్ని పార్టీలు సెంట్రల్ మరాత్వాడా, ఉత్తర , పశ్చిమ ప్రాంతాలపై ఫోకస్ చేసింది. 2.28 కోట్లకు పైగా ఓటర్లు ఇక్కడ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

**బిహార్ :** బిహార్ నుంచి ముఖ్యనేతలలో బెగుసరాయ్‌లో కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్, సీపీఐకి చెందిన అవధేష్‌రాయ్ మధ్య పోటీ నెలకొంది. ఉజియార్‌పూర్‌లో కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానంద్ రాయ్ హ్యాట్రిక్ విజయంపై కన్నేశారు. JD(U) మాజీ అధ్యక్షుడు రాజీవ్ రంజన్ సింగ్ 'లాలన్' కు ఆర్జేడీ నేత కుమారి అనితతో పోటీ ఎదుర్కొంటున్నారు.

## విశ్వనాథుని దర్శించనున్న మోదీ

లోక్‌సభ నియోజకవర్గం అభ్యర్థి మహేంద్ర నాథ్ పాండే తెలిపారు. ప్రధాని మోదీ తన సొంత నియోజకవర్గానికి పని చేసినంతగా ఏ ప్రధాని తన నియోజకవర్గానికి పనిచేయలేదన్నారు. కాశీ మొత్తం ప్రధానికి అండగా నిలుస్తోంది, కచ్చితంగా ఈ ఎన్నికల్లో ఆయన గెలిచి తీరుతారని ధీమా వ్యక్తం చేశారు. అమిత్ షా పర్యవేక్షణలో ప్రధాని నరేంద్ర మోడీ వారణాసిలో 14వ తేదీన నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు. ఇప్పటికే ఈ ఏర్పాట్లను హోంశాఖ మంత్రి అమిత్‌షా, సీఎం యోగి ఆదిత్యనాథ్ పర్యవేక్షిస్తున్నారు. ఆ పార్టీ సీనియర్ నేత సునీల్ బన్సల్ చాలా రోజుల నుంచి అక్కడే ఉండి పనులను చక్కబెడుతున్నారు. గతంలో నామినేషన్ దాఖలు చేసిన వివరాల ప్రకారం.. మోడీకి ప్రస్తుతం 73 ఏళ్లు. 2024 ఎన్నికల ప్రచారంలో నిత్యం వేల కిలోమీటర్లు ప్రయాణిస్తూ.. సగటున మూడు ప్రచార కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. వారణాసి నియోజకవర్గం నుంచి మోదీ మూడోసారి పోటీ చేస్తుండగా, ఆయనపై పోటీకి కాంగ్రెస్ అభ్యర్థి అజయ్ రాయ్ సైతం మూడోసారి బరిలో ఉన్నారు. జూన్ 1న జరిగే ఏడవ విడత ఎన్నికల్లో భాగంగా వారణాసిలో పోలింగ్ జరుగనుంది.

## పది గ్యారెంటీలతో ఆప్ అధినేత

కానీ వారెవరూ బీజేపీ కుట్రలను సాగనివ్వలేదని, ఆప్‌ను వీడి వెళ్లలేదన్నారు. 'దేశం మిమ్మల్ని చూసి గర్వపడుతోంద'ని తన పార్టీ ఎమ్మెల్యేలను అభినందించారు. ఆదివారం కేజ్రీవాల్ వారితో సమావేశం నిర్వహించారు. అనంతరం విలేకరుల సమావేశంలో లోక్‌సభ ఎన్నికలకు పది గ్యారెంటీలను ప్రకటించారు. కేంద్రంలో 'ఇండియా' అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా 24 గంటల విద్యుత్తు సరఫరా చేస్తామని, ఢిల్లీలో మాదిరిగా 200 యూనిట్ల ఉచిత కరెంటు ఇస్తామని చెప్పారు. ఢిల్లీలో చేసినట్టే దేశవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను ఆధునీకరిస్తామని తెలిపారు. ఢిల్లీ మోడల్‌లో దేశమంతటా మారుమూల ప్రాంతాలతో సహా 'మొహల్లా క్లినిక్'లు ఏర్పాటు చేస్తామన్నారు. చైనా ఆక్రమించిన భారత భూభాగాన్ని విడిపిస్తామన్నారు. స్వామినాథన్ కమిటీ నివేదికకు అనుగుణంగా రైతులకు కనీస మద్దతు ధర ఇస్తామన్నారు. ఢిల్లీకి పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తి కల్పిస్తామన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పించి నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ అవినీతిపై దేశవ్యాప్తంగా దాడులు చేయిస్తామని, జీఎస్టీని సరళం చేస్తామని కేజ్రీవాల్ తెలిపారు. అయితే, ఈ గ్యారెంటీలను 'ఇండియా' భాగస్వామ్య పక్షాలతో చర్చించలేదని, అందుకు సమయం దొరకలేదని ఒక ప్రశ్నకు బదులిచ్చారు. తాను ప్రధాని పదవి రేసులో లేనని స్పష్టం చేశారు. తర్వాత, కేజ్రీవాల్ పంజాబ్ సీఎం భగవంత్ సింగ్ మాన్‌తో కలిసి ఢిల్లీలో ఆప్ లోక్‌సభ అభ్యర్థుల తరఫున రోడ్ షో నిర్వహించారు.

## మెదక్ లో రసవత్తర రాజకీయం

ఎన్నికల్లో కూడా ఆ పార్టీ అభ్యర్థులు మెదక్ నుంచి గెలిచారు. గత మూడు ఎన్నికల్లో, ఇక్కడ కాంగ్రెస్ పార్టీ, బీజేపీ పార్టీలకు గెలుస్తామనే ఎటువంటి ఆశలు లేకుండానే బరిలోకి దిగాయి. ఈ సారి ఎన్నికల్లో మాత్రం, కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కూడా ఇక్కడ గెలవడానికి తమ సర్వశక్తులు వడ్డుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలో లేకపోవటం, కాంగ్రెస్ తెలంగాణలో అధికారం చేజిక్కుంచుకోవటం, బీజేపీ కూడా వరుసగా మూడోసారి కేంద్రంలో అధికారంలోకి రావటం అనే లక్ష్యంతో ఇక్కడ పోరాడుతున్నాయి. ఈ నేపథ్యంలో, కేసీఆర్, హరీశ్ రావుకు కూడా ఈ సీటు గెలుచుకోవటం అంత సులువైన పనిగా కనపడటం లేదు. రెండు జాతీయపార్టీలు, తమ వనరులన్నింటిని ఇక్కడ మోహరించడంతో, ఈ ఎన్నిక తొలిసారిగా ముక్కోణ పోటీగా మారింది. మెదక్ సీటుని ఎలాగైనా గెలుచుకోవాలని బీజేపీ అభ్యర్థి మాధవనేని రఘునందన్ రావు మెదక్ లో మోదీతో బహిరంగ సభ ఏర్పాటు చేయిస్తే, కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీతో నర్సాపూర్ లో బహిరంగ సభ ఏర్పాటు చేసింది. కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా సిద్దిపేట బహిరంగ సభ నిర్వహించగా... తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిద్ధిపేట, పటాన్ చెరులో బహిరంగ సభల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్, బీజేపీ మెదక్ ఎన్నికను ఎంత సీరియస్ గా తీసుకున్నాయి ఈ సభలను బట్టి అర్థం చేసుకోవచ్చని ఎన్నికల విశ్లేషకులు అంటున్నారు. మెదక్ లో బీఆర్ఎస్‌ను ఓడిస్తే, కేసీఆర్ పూర్తిగా బలహీనపడతారని ఆ రెండు జాతీయ పార్టీలు భావిస్తున్నాయని తేటతెల్లమవుతుంది. కేసీఆర్ దాదాపుగా అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో ప్రచారం చేయగా, హరీశ్ రావు ప్రతి మండలంలో ప్రచారం చేశారు. ఆ పార్టీకి ఇక్కడ ఆరుగురు ఎమ్మెల్యేలు ఉండటంతో, వారు గ్రామా గ్రామాన తిరిగి ప్రచారం చేశారు. ఈ ఎన్నికను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కేసీఆర్, హరీశ్ రావు ఎన్నికల ప్రచారాన్ని ప్రతి నిమిషం పరిశీలించారు. మెదక్ ఎన్నిక బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామి రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు, బీజేపీ పార్టీ అభ్యర్థి రఘునందన్ రావు కంటే, కూడా కేసీఆర్, రేవంత్ రెడ్డి, మోదీ మధ్యలోనే పోటీ లాగా మారిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## కంటోన్మెంట్ ఉపఎన్నిక..

చేస్తుండగా.. కాంగ్రెస్ అభ్యర్థిగా శ్రీగణేశ్, బీజేపీ నుంచి వంశీ తిలక్ బరిలో ఉన్నారు. గత ఏడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లపాటు మనుగడ సాగించాలంటే.. లోక్ సభ ఎన్నికల్లో డబుల్ డిజిట్ సీట్లను సాధించాల్సిన అవసరం ఉందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది. మరోవైపు బీజేపీపై సైతం లోక్ సభ ఎన్నికల్లో తెలంగాణపై ఫోకస్ పెట్టింది. ప్రధాని మోదీ, అమిత్ షా లాంటి అగ్ర నేతలు బీజేపీ తరఫున ప్రచారం నిర్వహించారు. గత లోక్ సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాల్లో విజయం సాధించిన బీఆర్ఎస్.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఈసారి ఢీలా పడింది. దీంతో కొన్ని నియోజకవర్గాల్లో కాంగ్రెస్, బీజేపీ మధ్యే పోటీ ఉండనుందనే అంచనాలు ఉన్నాయి. అయితే లోక్ సభ ఎన్నికల్లో సత్తా చాటడం ద్వారా మళ్లీ రేసులోకి రావాలని బీఆర్ఎస్ పట్టుదలతో ఉంది. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచిన దానం నాగేందర్ ఈసారి కాంగ్రెస్ అభ్యర్థిగా సికింద్రాబాద్ లోక్ సభ స్థానానికి పోటీ చేస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ 88 సీట్లు గెలుచుకొని అధికారంలోకి వచ్చింది. ఆరు నెలలలోపే జరిగిన లోక్ సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇదే ఆధిక్యాన్ని చెలాయించలేకపోయింది. 2019 లోక్ సభ ఎన్నికల్లో 16 సీట్లు సాధించాలని టార్గెట్‌గా పెట్టుకున్న బీఆర్ఎస్ 9 సీట్లకే పరిమితమైంది. బీజేపీ అనూహ్యంగా 4 చోట్ల విజయం సాధించగా.. కాంగ్రెస్ పార్టీ మూడు స్థానాల్లో, ఎంఐఎం ఒక చోట గెలుపొందాయి. గత ఎన్నికల్లో మోదీ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఈసారి తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లు సాధిస్తామని బీజేపీ నేతలు నమ్మకంతో ఉన్నారు.

# నేడే తుది తీర్పు...

ఎప్పుడు ఎప్పుడు అని ఎదురు చూసినా పార్లమెంటు ఎన్నికల సమరానికి సర్వం సిద్ధమై సమయం వచ్చేసింది. ఈ సందర్భంగా 'జయభేరి' అందిస్తున్న రాజకీయ సమగ్ర విశ్లేషనే కౌంటర్ విత్ కడారి శ్రీనివాస్..... తెలంగాణ రాష్ట్రంలో ఎప్పుడెప్పుడు అని ఎదురుచూసిన పార్లమెంటు ఎన్నికలకు రంగం సిద్ధం అయిపోయి ఓటర్లు నేడు ఓటు వేయడానికి వెళుతున్నారు... ఒక్కసారి ఆలోచించి సరైన నిర్ణయం తీసుకోవాలని ఈ కథనం మీకోసం అందిస్తుంది 'జయభేరి'....

- మాట తప్పిన నేతలకు వాత పెట్టండి...
- మీరు ఓటు వేయండి మీ పక్కవారితో ఓటు వేయించండి...




**జయభేరి, హైదరాబాద్ :**

ఎన్నికల అనగానే ఒక పండగల భావించే ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఓటు వేయడానికి అడుగులు ముందుకు వేయాలి. ఎందుకంటే ఈ దేశ భవిష్యత్తు మనం వేసే ఒక్క ఓటులోనే నెమడికృతమై ఉంటుందనే నిజాన్ని మరిచిపోవద్దు.. ఇక హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో చూసుకుంటే భాగ్యనగరంలోని రంగారెడ్డి హైదరాబాద్ పార్లమెంటు నియోజక వర్గాలలో నేతల మాటలు హద్దులు మీరిపోయి ఆశ చూపుతూ జర్నలిస్టుల నుండి సామాన్య ప్రజల వరకు మొండి చేయి చూపించారు... మేం పొడుగు పత్రికలం అని చెప్పుకొచ్చిన పెద్దపెద్ద పత్రికల యజమానులు కాసులకు కక్కుర్తిపడి సంచులు నింపుకొని పలాయనం చిత్తగించారు. అంటే జనాలు ఎక్కడన్నా పోనీ నేతలు ఏమైనా కానీ మాకు ముట్ట చెప్పండే మీ తలరాతలు రాస్తే జనాలను దారి మళ్ళి బెదురుతో కాసులు బాగానే దండుకున్న పొడుగు పత్రికలు లబ్ధి పొందాయి... కానీ సామాన్య ప్రజలకు ఒరిగింది ఏంటి!?


నిజానికి మేడ్చల్ మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం లో నాయకుల కంటే నాయకుల కింది కార్యకర్తలే నాయకులను ఆకాశానికి ఎత్తుతూ మాట్లాడే మాటలు చేసిన ప్రచారానికి సంబంధం లేకుండా ఉంటుంది. ఎందుకంటే ఆ నాయకుడు జెండాలు మార్చిన నేతకదా... మాట మార్చదని గ్యారెంటీ ఏంటి అనే ఆలోచన ప్రజలు తప్పకుండా చేయాలి. క మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం లో కాంగ్రెస్ అభ్యర్థి పట్నం మహేందర్ రెడ్డి స్థానికురాలు కాకపోయినా తాండూరులో చల్లని రూపాయి మల్కాజిగిరిలో ఎలా చెల్లుతుంది అనే వారు మల్కాజ్గిరి పార్లమెంటులో ఎక్కువగానే ఉన్నారు... ఇక గత పదేళ్ల పాలనలో ఏ మొరగబెట్టారు అంతా అవినీతి అని మాజీ సీఎం కేసీ ఆర్ని చీదరించి మళ్లీ పార్లమెంటు ఎన్నికల్లో అదే పార్టీకి ఓట్లు ఎలా వేస్తారు అనే వాదన లేకపోలేదు... ఇక బిజెపి పార్టీ మతతత్వ పార్టీ అన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయినా ఈటెల రాజేందర్ స్థానికుడు కాకపోవడం గతంలో రెండు సార్లు పరాజ్యం పొందడం ప్రశ్నార్థకంగానే మారింది... మరి ఓటు ఎవరికి వేయాలి అని మల్కాజిగిరి ప్రజలు సందేహించవచ్చు.... మా సర్వేలో బయటపడిన కొన్ని నిజాలను మీ ముందు ఉంచుతాను...

మల్కాజ్గిరి నియోజకవర్గం చాలా పెద్ద నియోజకవర్గం. ఇక్కడ నుంచి గెలిచి రికార్డును కొట్టాలని మూడు పార్టీల అభ్యర్థులకు ఉచ్చు కథ ఎక్కువగానే ఉంది... కానీ పార్లమెంట్ అభ్యర్థుల నేతల కింద పనిచేసిన లేబర్ కు కొంతమంది పైసలు ఇవ్వలేదని ఆరోపణలు కాదు ఇవి పచ్చి నిజాలు మా కళ్ళ ముందే కనిపించాయి... ప్రజా ప్రతినిధులుగా చలమనయ్యే వారు మాటమీద నిలబడ లేకపోవడం దేనికి సంకేతం... నిన్న ఒక మాట నేడు ఒక మాట రేపు మరొక మాట మాట్లాడే ప్రజా నేతలుగా చలామణి అవుతున్న వారిని గట్టిగా కరువు కాల్చి వాత పెట్టాల్సిన సమయం ఇదే.... అలాగే చిన్న పత్రికలను చులకన చేసి మాట్లాడుతూ మిమ్మల్ని ఎవరు రాయమన్నారు మమ్మల్ని బ్లాక్ మెయిల్ చేస్తున్నారా అంటూ ఎదురుదాడి చేసిన ఆ పార్టీ నేతలకు అధికార పార్టీ టికెట్ ఎలా ఇచ్చిందో అర్థం కాదు.... మనకి సాక్షాత్తు ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి మల్కాజ్గిరి పార్లమెంటు నియోజకవర్గం అభ్యర్థిగా 2018లో ఎన్నికైన విధానం సీఎం రేవంత్ రెడ్డి మరిచి పోయాడా.!? ఏ ఉద్దేశంతో పట్నం మహేందర్ రెడ్డిని ఇక్కడ తన భార్యను పట్నం సునీత మహేందర్ రెడ్డిని ఎంపీ అభ్యర్థిగా నియమించడం ఓటమిని అంగీకరించినట్లే అని మల్కాజ్గిరి ఓటర్లు దుమ్మెత్తి పోస్తున్నారు.. ఏమవుతుంది అందుకే మల్కాజ్గిరి నియోజకవర్గ పార్లమెంటు అభ్యర్థులను గెలిపించే ముందు అక్కడి ప్రజలు ఒకసారి ఆలోచించేసుకోవాలి...

అలాగే తెలంగాణ రాష్ట్రంలో పార్లమెంట్ అభ్యర్థులుగా వచ్చిన వారిని ప్రతి ఒక్కరిని పార్టీల కతీతంగా వ్యక్తిగతంగా వారి వారి గుణగణాలను పరీక్షించి గతంలో వారు ఏ పార్టీలలో ఎలాంటి పదవులు అనుభవించారు వారు చేసిన విధివిధానాలు పనితీరును పరిశీలించిన తరువాతనే పార్టీలకు అతీతంగా కులమతాలకతీతంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి... నా ఒక్క ఓటు వేయకపోతే ఏం కాదులే అనుకునే మూర్ఖులకు ఇది ఒక హెచ్చరిక కావాలి... నిజానికి గ్రామీణ ప్రాంతంలోనే ఓటింగ్ శాతం ఎక్కువగా ఉంటుంది. పట్టణ ప్రాంతంలో ఉండే ప్రజలు సెలవు ప్రకటించిన కనీసం ఓటు వేయడానికి సుముఖత చూపించకపోవడం చాలా సిగ్గుచేటు..

ఒక్క ఓటుతో దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారాన్ని రాజ్యాంగం మనకు అందించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఓటు వేసే ముందు ఒక్క క్షణం ఆలోచించి ఈవీఎం లో తమకిష్టమైన పటం నొక్కి మద్దతును తెలియజేయాలి.. అంతేకానీ ఆశ నిరాశల మధ్య రాజకీయ నేతలను గుడ్డిగా నమ్మొద్దు... నిజానికి కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రంలో అధికారం దక్కించుకుంది గాని ఆ దిశగా ప్రజలకు నమ్మకంగా పనిచేయట్లేదని ఆరోపణలు గుప్పుమంటున్నాయి.... అంటే అలివి కాని సంక్షేమ పథకాలకు తెరలేపి మళ్లీ కేంద్రంలో మమ్మల్ని గెలిపియండి అనే వాదనను తీసుకొస్తున్న తరుణంలో అన్ని నియోజకవర్గాల్లో ముఖ్యంగా మేడ్చల్ మల్కాజ్గిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ను కచ్చితంగా ఓడించి

> ఒక్క ఓటుతో దేశ భవిష్యత్తును నిర్ణయించే అధికారాన్ని రాజ్యాంగం మనకు అందించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరు ఓటు వేసే ముందు ఒక్క క్షణం ఆలోచించి ఈవీఎం లో తమకిష్టమైన పటం నొక్కి మద్దతును తెలియజేయాలి.. అంతేకానీ ఆశ నిరాశల మధ్య రాజకీయ నేతలను గుడ్డిగా నమ్మొద్దు...



తీరుతామంటున్నారు... ఎందుకంటే ఇక్కడ కాంగ్రెస్ పార్టీకి ప్రచారం చేసిన వారికి కనీసం డబ్బులు కూడా ఇవ్వని పరిస్థితి మాట మార్చిన విధానం చూస్తే అసలు పట్నం మహేందర్ రెడ్డి ఎవరు ఇక్కడ ఆయన ఎందుకు పోటీ చేస్తున్నట్టు అనే అనుమానం ప్రజల్లో బలంగా వచ్చింది...

ఇక బిజెపి పార్టీ రెండుసార్లు ఓడిపోయిన ఈటెల రాజేందర్ ఎలాగైనా ఇక్కడి నుంచి గెలిపించాలని దృఢ నిశ్చయంతో ముందుకు వస్తున్న ఈటెల రాజేందర్ గెలుపు ఆశ నిరాశల మధ్య కొట్టుమిట్టాడుతోంది... ఇక టిఆర్ఎస్ పార్టీ గత ఎన్నికల్లో ఓటమిన్ ఛాయి చూసి ఎలాగైనా ఎంపీ అభ్యర్థులుగా గెలిచి కేసీఆర్ గౌరవాన్ని పెంచాలి అని అనుకుంటున్నా వారికి ప్రజలు ఎలాంటి గౌరవాన్ని అందిస్తారో చూడాలి...

తెలంగాణ రాష్ట్రంలో ఏ నాయకుడైతే సరిగ్గా పనిచేయ లేదు ప్రజలు గుర్తించి వారికి కర్రు కాల్చి వాత పెట్టాలి... మనదేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్యం ఇంకా పేరు ప్రఖ్యాతులు మన దేశానికి ఉన్నాయి... నిజానికి దానికి ప్రధాన కారణం ఓటు వేసే ఓటర్లే... ఓటరు తన ఒక్క ఓటే అని ఆలోచించకుండా ప్రతి ఒక్క ఓటును సద్వినియోగం చేసుకుంటే ప్రజాస్వామ్యానికి ప్రాణం పోసినట్లు అవుతుంది.. పార్లమెంటు ఎన్నికలు నేడు పోటీకి ఎలక్షన్ జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు కచ్చితంగా ఆలోచించి తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలి.... ప్రజా ప్రతినిధులుగా వచ్చిన వాళ్ల విద్య తీరును వ్యక్తి విధానాన్ని ఆయన మాటతీరును ప్రవర్తన నియమాలని పార్టీలకు అతీతంగా వ్యక్తిగతంగా చూసి నచ్చితే ఓటు వేయాలి.. అలాగే మీకు ఏ ప్రజా ప్రతినిధి నచ్చకపోతే నోటాకు ఓటు వేయండి...



కడారి శ్రీనివాస్
కాలమిస్ట్, సీనియర్ జర్నలిస్ట్, కవి, రచయిత
గాయకులు, సామాజిక ఉద్యమకారులు

## టోల్ గేట్ల వద్ద భారీ క్యూ... సొంతూళ్లకు నగర జనం

**జయభేరి, హైదరాబాద్, మే 12:**

ఓట్ల పండుగ మొదలు కానుంది. ఎన్నికల వేళ అక్కడ తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు హైదరాబాద్ లో స్థిరపడిన ఓటర్లు భారీగా తరలివెళ్తున్నారు. ఉద్యోగ, ఉపాధి కోసం ఇక్కడ ఉండి ఐదేళ్లకోసారి తమకు ఇష్టమైన నాయకున్ని ఎన్నుకునేందుకు ఉత్సాహంగా సొంతూళ్లకు కదులుతున్నారు. ఈ క్రమంలో చాలామంది ఓటర్లు ప్రత్యేక బస్సులు, రైళ్లలో ఊర్లకు చేరుకుంటుండగా.. ఇంకొందరు తమ సొంత వాహ



నాల్లోనే స్వస్థలాలకు బయలుదేరారు. దీంతో హైదరాబాద్ విజయవాడ హైవేపై రద్దీ నెలకొంది. వారాంతం, వరుస సెలవులు, పోలింగ్ కు ఇంకా రెండు రోజులే టైం ఉండడంతో శనివారం వేకువజాము నుంచే జాతీయ రహదారిపై భారీగా ట్రాఫిక్ జాం నెలకొంది. ఈ వాహనాలు విజయవాడ మీదుగా రాజమహేంద్రవరం, విశాఖ వైపు తరలివెళ్తున్నాయి. జాతీయ రహదారిపై రద్దీ నేపథ్యంలో నెమ్మదిగా కదులుతున్నాయి. మరోవైపు, హైదరాబాద్ శివారు హయత్ నగర్ నుంచి అబ్దుల్లాపూర్ మెంట్ వరకూ ట్రాఫిక్ కు అంతరాయం కలుగుతోంది. అటు, చౌటుప్పల్, పంతంగి టోల్ ప్లాజాల వద్ద కూడా పెద్ద సంఖ్యలో వాహనాలు బారులు తీరాయి. మరోవైపు, హైదరాబాద్ నుంచి ఓటు వేసేందుకు వెళ్లే వారి కోసం టీఎస్ఆర్టీసీ ప్రత్యేక బస్సులు కేటాయించింది. అటు, దక్షిణ మధ్య రైల్వే సైతం ప్రత్యేక రైళ్లు నడుపుతోంది. దీంతో బస్టాండ్స్, రైల్వే స్టేషన్లు కిటకిటలాడాయి. కాగా, పది రోజుల ముందే బస్సుల్లో సీట్లన్నీ ఫుల్ అయ్యాయి. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీఎస్ఆర్టీసీ 2 వేల ప్రత్యేక బస్సులు కేటాయించింది. ఎంజీబీఎస్ నుంచి 500, జేబీఎస్ నుంచి 200, ఉప్పల్ నుంచి 300, ఎల్బీ నగర్ నుంచి 300 ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉన్నాయి. అయితే, ప్రయాణికుల రద్దీని బట్టి మరిన్ని బస్సులు పెంచే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు ఎన్నికల టైంను క్యాష్ చేసుకుంటున్నారు. సాధారణ రోజుల్లో ఏపీలోని ప్రధాన నగరాలకు రూ.500 నుంచి రూ.1000 వరకూ టికెట్ ఛార్జీలుండగా.. ప్రస్తుతం రూ.5 వేల వరకూ ఖర్చు చేయాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ స్లీపర్ బస్సుల్లో హైదరాబాద్ నుంచి విజయవాడ వరకూ టికెట్ రేట్లు రూ.2,500 వరకూ చూపిస్తున్నాయని పేర్కొంటున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, విమానాశ్రయాల్లోనూ ప్రయాణీకుల రద్దీ నెలకొంది. గన్నవరం విమానాశ్రయం శుక్రవారం సాయంత్రం నుంచి రద్దీగా మారింది. ఉమ్మడి కృష్ణా, ఉభయ గోదావరి, గుంటూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన ఓటర్లు ఇక్కడ దిగుతున్నారు. హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై వంటి నగరాల్లో స్థిరపడ్డ వారు సైతం ఓటేసేందుకు తమ సొంతూళ్లకు వస్తుండడంతో ఎయిర్ పోర్టులు, బస్టాండ్స్, రైల్వే స్టేషన్లలో భారీగా రద్దీ నెలకొంది.

# మన ఓటు - మన ఆయుధం

» ప్రపంచ గతిని మార్చగల శక్తి ఉన్న అస్త్రం"ఓటు". ఒక వ్యక్తి అస్తిత్వాన్ని గుర్తించి, వ్యవస్థ మార్పుకి నాంది పలికేది "ఓటు". ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమవంతు కర్తవ్యంతో ఉన్నతమైన నాయకుల్ని ఎన్నుకొనే విధానం. పురుషులతోపాటు మహిళలకు సమనహక్కు కల్పించిన మహిళల పక్షపాతి.



✍ జయభేరి, హైదరాబాద్ :

ఆయన రాసిన రాజ్యాంగం వల్ల నేడు మహిళలు చదువుకుని, ఉద్యోగాలు చేస్తున్నారు, రాజకీయాల్లో ఉంటున్నారు.. కార్మికులకు ఉద్యోగులకు 8గంటల పని హక్కు కల్పించిన కార్మిక పక్షపాతి. భారతీయు లందరికి 18 సంవత్సరాల వయస్సుకే ఓటుహక్కు ను కల్పించిన దేశ పౌరుల వేగుచుక్క ప్రజాస్వామ్యం అని గొప్పలు చెప్పుకునే యువత నీకు ఓటు హక్కు ఇచ్చింది అంబేడ్కర్.. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకో సం 5 సంవత్సరాల నుండి 14 సంవత్సరాల లోపల ఉన్నపిల్లలకు ఉచిత విద్యా హక్కు కల్పించిన భారత దేశ చిన్నారుల ఆణిముత్యం అంబేద్కర్. బానిస బ్రతు కులు బ్రతుకుతున్న అంటారనివాళ్ళ విముక్తి కోసం ఎస్సీఎస్టీబిసి లకు రిజర్వేషన్లు కల్పించి ఆరాధ్యుడు అంబేద్కర్. ఎస్సీ, ఎస్టీ లకు చట్టసభల్లో రిజర్వేషన్లు కలిపించిన గొప్ప వ్యక్తి దేశంలో రిజర్వ్ బ్యాంకు ద్యార ప్రతి ఒక్క భారతీయుడికి ఆర్థిక హక్కుల తో పాటు ఇంకా ఎన్నో హక్కులను ప్రసాదించిన మహనీ యుడు అంబేద్కర్. అన్నిటికంటే గొప్ప సంగతి దేశం గర్వపడే విషయం అంబేద్కర్ భారతీయులందరికి గొప్ప రాజ్యాంగాన్ని రచించిన మహా జ్ఞాని. రాజ్యాంగం ద్వారా హక్కులు పొందిన ప్రతి ఒక్కరికీ నాయకుడు అంబేద్కర్. ఈ దేశంలో కొందరి వాడు కాదు అందరివాడు, దేశ ప్రజలందరి ఆశ దీపం అంబేద్కర్.ఓటు రాజ్యాంగం కల్పించిన హక్కు.



వ్యాసకర్త: ఆలేటి రమేష్
99487 98982

ఓటు వేయండి ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. ఓటు హక్కును నైతికంగా వినియోగించుకోవడమే భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గారికి నిజమైన గౌరవం అవుతుంది" మనం డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ యొక్క తత్వశాస్త్రం మరియు భావజాలాన్ని వాస్తవికంగా అనువదించాలనుకుంటే, ఓటు హక్కును నైతికంగా మరియు న్యాయంగా వినియోగించుకోవడం మన ప్రధాన కర్త వ్యం ఓటు హక్కును వినియోగించుకోవడం ద్వారా మన రాజ్యాంగ హక్కులను పరిరక్షించుకోవడంతో పాటు దేశ ప్రగతికి భరోసా ఇవ్వగలం. ఓటును వినియోగించడం దేశ పౌరసత్వానికి చాలా అవసరమని మరియు చారిత్రాత్మకంగా అణగారిన వర్గాలకు ఓటు రాజకీయ విద్యగా ఉపయోగపడుతుందని అంబేద్కర్ గారు భావించేవారు. ప్రజాస్వామ్య పౌరసత్వం యొక్క అత్యంత ప్రాథమిక అంశాలలో ఒకటిగా ఓటు హక్కు ఉంది అని తెలిపారు. ఏ ప్రజా స్వామ్య దేశంలోనైనా ప్రజలే నిర్ణేతలు వారి మనోభా వాలను ప్రకటించేందుకు ప్రజల చేతిలో ఉన్న ఏకైక పదునైన ఆయుధం ఓటు.

భారత రాజ్యాంగం మనకు కల్పించిన ఓటు హక్కు. నీతి,నిజాయితీ, నమ్మకం, భాధ్యత ఉన్న వ్యక్తిని గెలిపించి చట్ట సభల్లోకి పంపిస్తే, ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం కోసం, మౌళిక వసతులు కల్పించడం కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం, నీతిగా నిజాయితీగా నమ్మకంతో భాధ్యతగా పని చేస్తారని, ఆనాడు పెద్దలు డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ గారు ఓటు హక్కును భారత రాజ్యాంగంలో పొందు పరిచారు. అదే "మన చేతిలో ఉన్న బ్రహ్మ అస్త్రం ఓటు హక్కు"కాని ఈనాడు రాజకీయ నాయకుల స్వార్థ ప్రయోజనాల కోసం,ప్రజలను తప్పు దారి పట్టించి,ప్రలోభాలకు గురి చేస్తు, మన హక్కును భ్రష్టు పట్టిస్తున్నారు. ఓటరు మహాశయులారా అలాంటి వారిని తరిమి కొట్టి నికార్సైన నాయకుని ఎన్నుకొని అభివృద్ధికి పాటుపడండి.

ప్రజాస్వామ్యం ప్రజల కోసం ఏర్పడిన ప్రజా యంత్రాంగం ప్రజాస్వామ్యం మనగలిగే ప్రజలు హాయిగా స్వేచ్ఛగా జీవించగలుగుతారు. భావవ్యక్తీకరణకు ప్రజలకు లభించిన వరం ప్రజాస్వామ్యం ప్రజలకు గొంతు ఇచ్చింది అరాచకాలపై పోరాడే హక్కు ఇస్తుంది ఇప్పటికీ పలు దేశాల్లో సౌదీ అరేబియా, వాటికన్ సిటీ మయన్మార్ లో ప్రజా స్వామ్యం ఏర్పడలేదు మరికొన్ని మత చాందస వాద దేశాల్లో ప్రజాస్వామ్యం మున్నా పరమతసహనం సున్నా ప్రజాస్వామ్యం లేని ప్రజల జీవితం దుర్భరం ప్రజాస్వామ్యాన్ని గౌరవించాలి ఓటు హక్కును నమ్ముకోవాలి అమ్ము కోకూడదు ప్రజాస్వామ్య సమాజంలో స్వేచ్ఛగా జీవించాలి. ప్రజల చేత ప్రజల కొరకు ప్రజలే ఎన్నుకొనే చట్టబద్ధమైన విధానాన్ని ప్రజాస్వామ్యంగా అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహం లింకన్ నిర్వచించారు.

ప్రజలు కనికరించి ఓటు వేస్తే పాలకులు అయ్యే రోజులు వచ్చాయి.. పటిష్టమైన ప్రజాస్వామ్యం ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం, ప్రజాస్వామ్య పునాదులు బలంగా లేని దేశాల్లో ప్రజాస్వామ్యం అనేది నేతిబీరకాయ చందంలా నిరుపయోగమే. ఏ దేశంలోనైనా ప్రజాస్వామ్యం మనుగడ సాగించాలంటే ఆయా దేశాల ప్రజలు చైతన్యవంతులై విద్యావంతులై ప్రజాస్వామ్య స్ఫూర్తి కలిగి ఉండాలి.

అంబేద్కర్ కల్పించిన ఆయుధం ఓటు ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టి ప్రజలకు సుపరిపాలన అందించటంలో అత్యంత కీలకం కానీ ఓటు నోటుకు బానిసయ్యి ప్రజలను బానిసత్వంలోకి తీసుకెళ్లే పరిస్థితి గురించి ఆలోచించి ఓటు వేసి మెరుగైన సమాజాన్ని నిర్మిద్దాం భావి తరాలకు బంగారు బాట వేద్దాం...



## ఓ దివ్యమైన యాత్రస్థలిని తలపించింది

» శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జియ్యర్ స్వామివారి మంగళాశాసనములతో.. జగదాచార్యులు భగవద్రామానుజుల 1007 తిరునక్షత్రాన్ని ఆదివారం ఒక మహోత్సవంగా జరుపుకున్నాం...

✍ జయభేరి, ఉప్పల్ :

ఎనిమిది సంవత్సరాల క్రితం ఒక అనామకమైన చౌరస్తాగా వున్న ప్రాంతం శ్రీ రామానుజుల భవ్యమైన మూర్తిని ప్రతిష్టించాక ఇవాళ భాగ్యనగరంలోనే ఒక దివ్యస్థలిగా మారిపోయింది... ఇవాళ ఆచార్య అనుగ్రహాన్ని పొందడానికి శ్రీరామానుజ సర్కిల్ ప్రాంతానికి, ఆంజనేయ బృహన్మూర్తి కొలువైన రామానుజ మందిరానికి విచ్చేసిన దాదాపు వెయ్యి మందిని చూస్తే మనసు పులకించిపోయింది... ఇదొక జన సమ్మర్దమైన ఓ మామూలు చౌరస్తాలాగా కాక ఓ దివ్యమైన యాత్ర స్థలిని తలపించింది... ఇది అపర రామానుజులైన శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామివారి కరకమలములచే ప్రతిష్టితమైన శుభ ముహూర్తప్రభావమే అని నా ప్రగాఢ విశ్వాసం... ఇవాల్టి శుభోదయాన రామానుజ సర్కిల్ 8వ వార్షికోత్సవాన్ని, వారి 1007వ తిరునక్షత్రమును పురస్కరించుకొని సర్కిల్ లోని ఆచార్యమూర్తికి ఆరాధన, తిరుమంజనం, ఆచార్య అష్టోత్తర శతనామార్చన, భజ యతిరాజ స్తోత్ర సామూహిక పారాయణం తదితర సంప్రదాయ కైంకర్యములన్నీ ఎంత అద్భుతంగా జరిగాయో చూస్తుంటే రెండు కళ్లు చాలలేదు ఇది నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను... సర్కిల్ చుట్టూ వేలాది వాహనాలపై వెళ్లేవారంతా, ఆగి ఆచార్య దివ్యమంగళమూర్తిని దర్శించుకొని పోవడం చూస్తే మహదానందం కలిగింది... ప్రఖ్యాత సోలిస్ కంటి ఆస్పత్రి అధినేత శ్రీమాన్ రాము గారు ప్రతినెల ఆర్ద్ర నక్షత్రం రోజు భగవద్రామానుజుల విగ్రహమూర్తికి సంప్రదాయ ఆరాధనా కైంకర్యం నిర్వహించడంతో పాటు ప్రసాద వితరణ కూడా చేస్తున్న సంగతి మనకు విదితమే.... ఈ రోజు కూడా ఐదువందల మందికి పైగా ఆచార్య నివేదిత అన్న ప్రసాదాన్ని, 60లీటర్ల పెరుగుతో చేసిన మజ్జిగ పానీయాన్ని అందించి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు... ఈనాటి సర్కిల్ లోని భగవద్రామానుజుల తిరునక్షత్ర, విగ్రహ 8వ వార్షికోత్సవానికి స్థానిక ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, స్థానిక కార్పోరేటర్లు పి.దేవేందర్ రెడ్డి, జెరిపోతుల ప్రభుదాస్, మాజి కార్పొరేటర్ జి.శ్రీనివాస్ రెడ్డి, ప్రముఖ రాజకీయ నాయకులు, పోలీసు ఉన్నతాధికారులు, ఇతర విభాగాలకు చెందిన మరెందరో అధికారులు హాజరయ్యారు.




## హైదరాబాద్‌లో ఘోరం

» బైక్‌లో మంటలు ఆర్పుతుండగా భారీ పేలుడు, పలువురికి తీవ్ర గాయాలు



✍ జయభేరి, హైదరాబాద్ :

హైదరాబాద్‌లో బైక్ పేలిన ఘటనలో పదిమంది గాయపడ్డారు. ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. హైదరాబాద్ పాతబస్తీ భవానీనగర్ పిఎస్ పరిధిలో ఈ ఘటన జరిగింది. గాయపడిన వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. మొఘల్‌పురా అస్లా ఫంక్షన్ హాల్ సమీపంలో రోడ్డుపై వెళుతున్న బైక్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో దానిపై ప్రయాణిస్తున్న వ్యక్తి వెంటనే వాహనాన్ని ఆపేశాడు. మంటల్ని ఆర్పేందుకు స్థానికులు ప్రయత్నించారు. బైక్‌పై వాటర్ పైప్‌తోనీళ్లు పోసి మంటల్ని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో పెట్రోల్ ట్యాంక్ ఒక్కసారిగా పేలిపోయింది. బైక్ చుట్టూ గుమిగూడి ఉన్న వారు ఈ ఘటనలో గాయపడ్డారు. మంటల్లో గాయపడిన క్షతగాత్రులను సమీపంలోని ఓ ప్రయివేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ద్విచక్ర వాహనం పెట్రోల్ ట్యాంకు పేలిన ఘటన తలాబ్ కట్ట ప్రాంతంలో విధ్వంసాన్ని సృష్టించింది. పాత బస్తీ భవానీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనలో పది మంది గాయపడగా వారిలో ముగ్గురు ప్రాణాపాయ స్థితిలో ఉన్నారని పోలీసులు తెలిపారు. ఆదివారం తలాబ్‌కట్టకు చెందిన అబ్దుల్ రెహానా ఖాన్ తన భార్య నేహాతో కలిసి మొగల్‌పుర వెళ్తున్నారు. తలాబ్‌కట్ట అస్లాం ఫంక్షన్‌హాల్ సమీపంలోకి రాగానే వాహనం ఇంజిన్ సమీపంలో మంటలు రేగాయి. దీంతో రెహాన్ వాహనాన్ని నిలిపివేయడంతో మంటలు పెరిగాయి. మంటల్ని అదుపు చేసేందుకు రెహాన్ ప్రయత్నించాడు. మంటల్ని అదుపు చేయడానికి ప్రయత్నించిన రెహాన్‌కు చెరకు బండి యజమాని ఎండీ నదీమ్, స్థానికంగా నివసిస్తున్న షౌకత్ అలీ, గౌస్ రెహ్మాన్ అజీజ్, ఖాదర్, హుస్సేన్ ఖురేషీ, సలే సూద్, ఖాజా పాషా, షేక్ అజీజ్‌తో పాటు ఎన్నికల విధుల్లో ఉన్న ఏఆర్ కానిస్టేబుల్ సందీప్ తదితరులు నీళ్లు, మట్టి చల్లి మంటల్ని అదుపు చేసేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో నదీమ్ వాహ నంలో పెట్రోలు ఉందో లేదో చూసేందుకు ట్యాంకు మూత తెరిచారు. దీంతో ఒక్కసారిగా భారీ పేలుడు చోటు చేసుకుంది. ఈ ఘటనలో నదీమ్ (32), షౌకత్‌అలీ(42), రెహాన్ ఖాన్(28)లకు మంటలు చుట్టుముట్టాయి. పేలుడు ధాటికి సమీపంలో ఉన్న మరికొందరికి కూడా గాయాలయ్యాయి. వాహనం చుట్టూ జనం గుమిగూడి ఉండటంతో ఈ ఘటనలో గాయపడిన వారి సంఖ్య పెరిగింది. తొలుత భారీ పేలుడు శబ్ధం వినిపించిందని, భయంతో జనం పరుగులు తీసినట్టు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఘటనాస్థలికి చేరుకున్న భవానీనగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. పేలుడుకు గల కారణాలపై విచారణ ప్రారంభించామని, వివరాలు సేకరిస్తున్నామని పోలీసు అధికారి ఒకరు తెలిపారు. క్షతగాత్రులను సమీపంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.



## మాజీ ఎమ్మెల్యేను మాజీ మంత్రి పరామర్శించారు

» తండ్రి పాడెమోసిన నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్

✍ జయభేరి, దేవరకొండ :

నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ తండ్రి కనిలాల్ నాయక్ అంత్యక్రియల సందర్భంగా నల్లగొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ పాడేమోశారు. అనంతరం మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి కనిలాల్ మృత దేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ ని మాజీ మంత్రి జగదీశ్వర్ రెడ్డి పరామర్శించారు వీరి వెంట మాజీ ఎమ్మెల్యేలు నల్లబోతు భాస్కరరావు, నోముల భగత్, కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి, ఫైళ్ళ శేఖర్ రెడ్డి, మాజీ ట్రైకర్ చైర్మన్ రామచంద్రనాయక్ తదితరులు ఉన్నారు.



## అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలు



✍ జయభేరి, దేవరకొండ :

మహాలక్ష్మి మహిళ వృద్ధాశ్రమం నందు అంతర్జాతీయ మాతృ దినోత్సవ వేడుకలు దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించినారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు NVT, సంధ్యారెడ్డి సభ్యులతో కలిసి కేక్ కట్ చేసి మాతృ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేసినారు. అనంతరం పండ్లు పంచి అన్నదానం చేసినారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు NVT మాట్లాడుతూ.. ఈ సృష్టిలో తీయనైనది అమ్మ ప్రేమని, అమృతానికి అర్పణకు అసలు పేరు అమ్మని, ప్రతి మనిషి పుట్టుకకు పట్టుగొమ్మ అమ్మని, అమ్మ మనసు కాశి గంగ కన్నా పవిత్రమైనదని, నవ మాసాలు మోసి కనిపించి ప్రయోజకులు గా చేసిన తర్వాత ఎంతోమంది కన్నతల్లులను వృద్ధాశ్రమంలో వేయడము అనేది ధర్మం కాదని, ప్రతి ఒక్కరూ తమ తల్లిదండ్రులని ఎంత విసిగించిన విసుగు చెందకుండా తమ వద్దనే ఉంచుకొని కడ చేరేంతవరకు వారికి సేవలు చేయాలని ఈ సందర్భంగా వారున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, రాపోలు నిరంజన్, భాస్కర్ రెడ్డి, తాళ్ల సురేష్ ఫోటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇండియన్ ఫోటో స్టూడియో అధినేత భాస్కర్, సందీప్, డాన్స్ మాస్టర్ క్రాంతి, కరాటే మాస్టర్ శ్రీను, సలేశ్వర్ యాదవ్,బాలు, రంజాన్ అలీ, శేఖర్ డ్యాన్స్ మాస్టర్ జగన్, యూట్యూబ్ డైరెక్టర్ ఆర్య, కలెట్లగిరి, అమితేష్, అజయ్ చంద్ర, రవికాంత్, రాహుల్, సాయి, రోహిత్, రఘు, అభిరామ్, అంజి, పవన్, శృతి, గీతిక, అంజలి, గాయత్రి, జయలక్ష్మి జానకి యాదమ్మ లక్ష్మమ్మ క్రీడాకారులు కళాకారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు భారీ వర్షం కురిసే అవకాశం

✍ జయభేరి, హైదరాబాద్ :

రాష్ట్రంలో ఐదు రోజులపాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కరీంనగర్, వరంగల్, ఖమ్మం, రంగారెడ్డి సహా మరికొన్ని జిల్లాలలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది. ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, ఖమ్మం, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలలో గంటకు 30 నుండి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉన్నట్లు తెలిపింది. హైదరాబాద్ నగరంలో నేడు భారీ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. నగరంలో భారీ వర్షం నేపథ్యంలో నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని GHMC అధికారులు పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో సమస్యలపై స్పందించేందుకు 040 21111111, 9000113667 నెంబర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు.








# హత్య కేసు పరిశోధనలో..

'ఆర్.ఎక్స్ 100' 'మంగళవారం' వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైంది పాయల్ రాజ్‌పుత్. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'రక్షణ'. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో ప్రణదీప్ ఠాకూర్ తెరకెక్కిస్తున్నారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమా టైటిల్ పోస్టర్‌ను ఆదివారం విడుదల చేశారు. 'క్రైమ్ ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ కథాంశమిది. పాయల్ రాజ్‌పుత్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపిస్తుంది. గత చిత్రాలకు పూర్తి భిన్నంగా ఆమె పాత్ర సాగుతుంది. ఒక హత్యా నేరానికి సంబంధించిన పరిశోధనలో ఎలాంటి మలుపులు చోటుచేసుకున్నాయనేది ఆసక్తిని రేకెత్తిస్తుంది. నటిగా పాయల్ రాజ్‌పుత్‌కు కొత్త ఇమేజ్‌ను తీసుకొచ్చే చిత్రమిది' అని దర్శకుడు తెలిపారు. రోషన్, మానస్, రాజీవ్ కనకాల, వినోద్‌బాల తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: అనిల్ బండారి, సంగీతం: మహతి స్వరసాగర్, నిర్మాతలు: ప్రకాష్ జోసెఫ్, రమేష్ రెడ్డి, లైన్ ప్రొడ్యూసర్: శరద్‌వాఘ్రే, నిర్మాణం, దర్శకత్వం: ప్రణదీప్ ఠాకూర్.

# ఓటీటీలోకి.. జర హట్కే జర బచ్కే

బాలీవుడ్ నటులు విక్కీ కౌశల్, సారా అలీఖాన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జర హట్కే జర బచ్కే'. ఫ్యామిలీ డ్రామాగా వచ్చిన ఈ సినిమాను లక్ష్మణ్ ఉటేకర్ దర్శకత్వం వహించగా.. జియో స్టూడియోస్‌తో కలిసి మ్యాడాక్ ఫిలింస్ నిర్మించింది. గతేడాది జూన్ 02న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద బ్లాక్ బస్టర్ అందుకుంది. కేవలం రూ.40కోట్లతో నిర్మించిన ఈ చిత్రం రూ.115 కోట్లు వసూళ్లను రాబట్టింది. కొత్తగా పెళ్ళైన దంపతులు వైవాహిక జీవితం కోసం కుటుంబం నుంచి విడిపోయేందుకు చేసే ప్రయత్నాలే ఈ సినిమా కథ. అయితే ఈ సినిమా విడుదలై 11 నెలలు అవుతున్న ఇప్పటివరకు ఓటీటీలోకి రాలేదు. ప్రేక్షకులు ఎప్పుడు ఈ సినిమా చూద్దామన్నా నిరాశే ఎదురయ్యింది. ఇదిలావుంటే తాజాగా ఈ మూవీకి సంబంధించి ఓటీటీ అప్‌డేట్ వచ్చింది. ప్రముఖ ఓటీటీ వేదిక జియో సినిమా ఈ సినిమాను మే 17 నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ సినిమాను హిందీలోనే కాకుండా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో అందుబాటులోకి తీసుకురానున్నట్లు జియో సినిమా ప్రకటించింది.





# డేట్స్ ఖాళీ లేవు!

కన్నడ సోయగం రష్మిక మందన్న తారాపథంలో దూసుకుపోతున్నది. తెలుగు, హిందీ, తమిళ భాషల్లో వరుసగా భారీ సినిమాలతో బిజీబిజీగా మారింది. మరో ఏడాది పాటు ఈ అమ్మడి డేట్స్ ఖాళీ లేవు అంటున్నారు. ప్రస్తుతం రష్మిక చేతిలో ఆరు సినిమాలున్నాయి. వీటి షూటింగ్స్ మొత్తం పూర్తి కావడానికి ఏడాదికిపైగా సమయం పడుతుందంటున్నారు. దాంతో ఈ భామ డేట్స్ కావాలంటే మరో ఏడాది పాటు ఆగాల్సిందే. ప్రస్తుతం రష్మిక మందన్న తెలుగులో పుష్ప2, రెయిన్‌బో, గర్ల్‌ఫ్రెండ్, కుబేర చిత్రాల్లో నటిస్తున్నది. 'పుష్ప2' చిత్రీకరణ తుదిదశకు చేరుకోగా..మిగిలిన మూడు చిత్రాలు షూటింగ్స్ జరుపుకుంటున్నాయి. ఇక బాలీవుడ్‌లో 'యానిమల్' బ్లాక్‌బస్టర్ విజయంతో ఈ సొగసరికి అవకాశాలు వెల్లువెత్తున్నాయి. 'సికిందర్' సినిమాలో సల్మాన్‌ఖాన్‌తో జోడీ కట్టబోతున్నది. విక్కీకౌశల్‌తో 'ఛావా' సినిమాలో నటిస్తున్నది. హిందీలో మరికొన్ని ఆఫర్లొచ్చినా.. డేట్స్ ఖాళీలేని కారణంగా రష్మిక అంగీకరించలేదని అంటున్నారు. మొత్తంగా చూస్తే మరో ఏడాది పాటు రష్మిక మందన్న డేట్స్ దొరకడం కష్టమేనని ఫిల్మ్‌సర్కిల్స్‌లో వినిపిస్తున్నది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com